# నేల తల్లిని కాపాడుకుందాం..!

పిల్లలను ఆడించి, పాడించి, లాలించి, పోషించేది అమ్మ.
మరి, ఆ అమ్మ ఆరోగ్యం దెబ్బ తింటే.. శక్తి సన్నగిల్లితే..
ఆ పిల్లలు ఏమైపోతారో ఒక్కసారి ఆలోచించండి..!

మనందరికీ ఆహారాన్ని అందించి, ఆయువు పోసేది నేల తల్లి.
మరి, ఆ నేల తల్లి 'ఆరోగ్యం' క్షీణిస్తే.. శక్తి హరించుకుపోతే..
మనమంతా ఏమైపోతామో ఒక్కసారైనా ఆలోచించారా..?!



రైతు సదస్సుకు హాజరైన రైతులు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 5: యావత్ జీవ జాతి మనుగడకు మూలమైన నేల తల్లి ఆరోగ్యం దెబ్బతినకుండా, శక్తి హరించకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు పి.జంబమ్మ, కె.శిరీష కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల సంయుక్తంగా మండలంలోని వినాయకపురం గ్రామంలోని రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించాయి. వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు జంబమ్మ, శిరీష మాట్లాడుతూ.. చాలా పరిమితంగా, అవసరమైనంత వరకు మాత్రమే రసాయన ఎరువులు/మందులు వాడితే మంచిదని చెప్పారు. సేంద్రియ సాగుతో నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఆయిల్ పాం, మునగ, కూరగాయల సాగులో అనుభవాలను స్థానిక రైతులు నల్లపు వెంకటరమణ, మల్లంపల్లి సత్యనారాయణ వివరించారు. ఎరువుల షాపు డీలర్ మారుతి లక్ష్మణరావు మాట్లాడుతూ.. విత్తన రశీదులను భద్రపర్చుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను, గడువు తేదీ ముగిసిన రసాయనాలను, పురుగు మందులను కొని నష్టపోవద్దని హెచ్చరించారు. చైతన్య ఫౌండేషన్ ప్రతినిధి నల్లపు శివకుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో ఏదీ వృథాగా పోదని సోదాహరణగా వివరించారు. ప్రసవ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీకృష్ణ చైతన్య, ఏఈవో రవీంద్రరావు, పంచాయతీ కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో డాక్టర్ బాబూరావు

అశ్వారావుపేట టౌన్, మే 5: సాగులో రసాయన ఎరువులను ఎక్కువగా వాడడం ద్వారా పర్యావరణం (భూమి, గాలి, నీరు) కలుషితమవుతున్నదని, ఆహారం విషతుల్యమవుతున్నదని, చివరికి.. చంటి పిల్లలపాలిట అమృతంగా భావించే కన్న తల్లి పాలు కూడా విషపూరితంగా మారుతున్నాయని స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. 'రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు వేదికలో సోమవారం రైతులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ.. సాగులో రసాయనిక ఎరువులు/పురుగు మందుల వాడకం ద్వారా యావత్ జీవ జాతికి కలుషిత ఆహారం అందిస్తున్నామని ఆవేదన–ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులను ఎంత మోతాదులో వాడాలో తెలుసుకునేందుకు భూసార పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. పంట మార్పిడి విధానంతో సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, ఏడీఏ రవికుమార్, వెటర్నరీ ఏడీహెచ్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, శాస్త్రవేత్తలు ఐవీఎస్ రెడ్డి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ నాగాంజలి, డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్, టి.పావని, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ స్వప్న, ఏవో శివప్రసాద్, హెచ్‌వో వేణుమాధవ్, పామాయిల్ రైతు సంఘం నాయకుడు కె.పుల్లయ్య పాల్గొన్నారు.

# ఎంజాయ్ చేద్దురుగానీ.. పిల్లల్లారా.. రండర్రా..!

**''హాయ్ పిల్లలూ... ఈ వేసవి సెలవుల్లో చక్కగా ఎంజాయ్ చేద్దురుగానీ రండర్రా..!**

**యోగా, కరాటే, డ్యాన్స్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, పెయింటింగ్, కంప్యూటర్, క్యారమ్స్, చెస్.. ఇలా ఎన్నెన్నో ఆడుకోవచ్చు, మరెన్నో నేర్చుకోవచ్చు. మీరు తినడానికి స్నాక్స్ కూడా ఇస్తాం. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఎంజాయ్ చేయొచ్చు. ఇంకెందుకు ఆలస్యం..! ఆరు నుంచి తొమ్మిదోతరగతి వరకు చదువుతున్న పిల్లలంతా వచ్చేయండి.. వచ్చేయండి..!!''**

అంటూ, మరీ మరీ పిలుస్తున్నారు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉరకలేస్తున్న ఉత్సాహంతో అనేకమంది పిల్లలు వచ్చారు.

- చుంచుపల్లి: మండలంలోని రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాబూ క్యాంప్ జీహెచ్ఎస్‌లలో శిబిరాలను ఎంఈవో బాలాజీ ప్రారంభించారు. గ్రామ పెద్దలు రజాక్, యాకయ్య, సాగర్, నవీన్, పెనగడప హెచ్ఎం చంద్రశేఖర్, టీచర్లు గణేష్, కవిత, సిబ్బంది ధీరజ్, సీఆర్‌పీ రవీందర్, డ్యాన్స్ మాస్టర్ నరసింహారావు, డ్రాయింగ్ మాస్టర్ రాధ తదితరులు పాల్గొన్నారు.
- జూలూరుపాడు: స్థానిక జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో శిబిరాన్ని ఎంఈవో జుంకీలాల్ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసయ్య, ఉపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసరావు, నంద్రు గురుమూర్తి, ప్రసాద్, కృష్ణ, లలిత, శకుంతల తదితరులు పాల్గొన్నారు.
- దమ్మపేట: మండలంలోని మల్కారం జడ్పీహెచ్ఎస్‌లో శిబిరాన్ని ఉపాధ్యాయులు ప్రారంభించారు.
- అశ్వారావుపేట టౌన్: స్థానిక జిల్లాపరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో శిబిరాన్ని ప్రధానోపాధ్యాయురాలు పరిటాల హరిత ప్రారంభించారు. ఉపాధ్యాయులు నర్సింహారావు, కిషోర్, కొండలరావు, ప్రభాకరాచార్యులు, రాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.
- టేకులపల్లి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శిబిరాన్ని ప్రధానోపాధ్యాయుడు మెరుగు శ్రీనివాస్, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ భూక్యా నాగమణి ప్రారంభించారు. శిక్షకులు రాజేష్, దుర్గ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.
- అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరాన్ని ఎంఈవో వీరాస్వామి, ఎంపీడీవో గంట వరప్రసాద్ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సైదులు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: మాట్లాడుతున్న ఎంఈవో జుంకీలాల్



అశ్వారావుపేట టౌన్: మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు హరిత



దమ్మపేట: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు



టేకులపల్లి: శిక్షణ శిబిరంలో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు

## పాత జిన్నలగూడెంలో క్రికెట్ టోర్నమెంట్

పర్ణశాల, మే 5: మండలంలోని పాత జిన్నలగూడెం పంచాయతీలో మినీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు టీములు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. సోమవారం తొలిరోజు పోటీలను మాజీ ఎంపీపీ రేసు లక్ష్మీ ప్రారంభించారు. కార్యక్రమంలో మీడియం కొండబాబు, సోయం కృష్ణబాబు, పాపారావు, సోందే గంగరాజు పాల్గొన్నారు.

## నేనున్నాను.. అధైర్యపడొద్దు : ఎంపీ వద్దిరాజు



బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శిస్తున్న వద్దిరాజు

జూలూరుపాడు, మే 5: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, దళిత నాయకుడు చెంగల నర్సింహారావు కొంతకాలంగా మెదడులో కణితితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని పార్టీ స్థానిక నాయకులు ఇటీవల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించారు. నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి డైరెక్టర్‌తో మాట్లాడి, తక్షణ వైద్యం అందించాలని కోరారు. నర్సింహారావుకు వైద్యులు ఆపరేషన్ చేసి కణితి తొలగించారు. ఐసీయూలో ఉన్న ఆయనను సోమవారం వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. ''నేనున్నాను.. అధైర్యపడొద్దు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడేంత వరకు నేను చూసుకుంటా'' అని ధైర్యం చెప్పారు. ఎంపీ వెంట హైకోర్టు అడ్వకేట్ ఉస రఘు, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, లకావత్ గిరిబాబు, సీనియర్ జర్నలిస్ట్ బాపట్ల మురళి ఉన్నారు.

## అర్జీలను పరిశీలించి, పరిష్కరించాలి



దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరిన ప్రజలు

కొత్తగూడెం టౌన్, మే 5 : ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భద్రాద్రి ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి అందజేసిన అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్లు వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.

## అర్హులైన గిరిజనులకే సంక్షేమ పథకాలు : పీవో

భద్రాచలం, మే 5 : దరఖాస్తు చేసుకున్న గిరిజనుల్లో అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి పీవో వినతులు స్వీకరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తన పరిధిలో ఉన్న వాటిని పరిశీలించి, మిగతా వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ చంద్రశేఖర్, ఆర్‌సీవో గురుకులం నాగార్జునరావు, అరుణకుమారి, ఏవో సున్నం రాంబాబు, ఎస్‌వో ఉదయ్‌భాస్కర్, ఉద్యాన అధికారి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 5 : భద్రతా దళాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్–తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గత 15 రోజులుగా తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్‌లో భాగంగా మావోయిస్టుల వేటలో జవాన్లు నిమగ్నమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కర్రెగుట్టల్లోని దట్టమైన అటవీ మార్గంలో భద్రతా దళాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. గమనించిన తోటి జవాన్లు క్షతగాత్రులను హుటాహుటిన జిల్లా కేంద్రానికి తరలించారు. గాయపడిన జవాన్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్)కి చెందిన థాన్‌సింగ్, అమిత్ పాండే అని తెలుస్తోంది. ప్రస్తుతం ఇద్దరు జవాన్లకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

## సీఐను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం, మే 5: భద్రాచలం నూతన ఎస్సైగా నాగరాజు బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. సోమవారం సీఐ నాగరాజును బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ నాగరాజును కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్, నాయకులు, యువజన విద్యార్థి విభాగం, సోషల్ మీడియా నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వ పథకాల్లో దళారులను నమ్మవద్దు

### పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

కరకగూడెం, మే 5: ప్రభుత్వ పథకాల్లో దళారుల జోక్యం నమ్మవద్దని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలో ఎమ్మెల్యే పాయం విస్తృతంగా పర్యటించారు. ముందుగా రఘునాథపాలెంలో 20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అలాగే వెంకటాపురం, తాటిగూడెం, వట్టంవారిగుంపు, చిరుమళ్ల గ్రామాల్లో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. పలువురికి కళ్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన పంచాయతీ సమీక్ష సమావేశం ఎమ్మెల్యే మాట్లాడారు. పథకాలు వర్తింపజేసేందుకు దళారుల మాటలు నమ్మి మోసోవద్దని ప్రజలకు సూచించారు. అనంతరం చిరుమళ్ల పెద్దవాగుపై నిర్మించిన వంతెన గత వర్షాకాలంలో కోతకు గురికావడంతో వంతెనను పరిశీలించి సైడ్ వాల్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. ఎంపీడీవో దేవర కుమార్, తహసీల్దార్ నాగప్రసాద్, ఆయాశాఖల డీఈలు, ఏఈఈలు, నాయకులు పోలెబోయిన శ్రీవాణి, ఇక్బాల్‌హుస్సేన్, ఎర్ర సురేష్, రాందాస్, రవి పాల్గొన్నారు.

## 'ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్'గా వెంకటేశ్వర్లు



ఆవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

అన్నపురెడ్డిపల్లి, మే 5: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ సర్టిఫైడ్ ట్రైనర్‌గా అన్నపురెడ్డిపల్లికి చెందిన పర్సా వెంకటేశ్వర్లు గుర్తింపు పొందారు. ఆదివారం రాత్రి ఖమ్మం లో జరిగిన రీజియన్ త్రీ ట్రైనర్స్ క్యాంపు కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లుకు అవార్డును ప్రదానం చేసి, సర్టిఫికేట్‌ను అందజేశారు.

# అంతర్రాష్ట్ర వాహనాల దొంగ అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు

అశ్వారావుపేట, మే 5: అతడొక ఆటో డ్రైవర్. వ్యవనాలకు బానిసగా మారాడు. ఆటోపై ఆదాయం చాలకపోవడంతో దొంగగా మారాడు. అతడిని అశ్వారావుపేట పోలీసులు పట్టుకున్నారు. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామస్తుడు ముత్యాల గణేష్.. వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. వ్యసనాలకు బానిసగా మారాడు. ఆదాయం చాలకపోవడంతో తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాల దొంగగా మారాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో, రద్దీ ప్రదేశాల్లో వాహనాలను చోరీ చేస్తున్నాడు. వాటిని నంబర్ ప్లేట్లు మార్చి అమ్ముతున్నాడు. స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ఎస్సై అఖిల, సిబ్బంది కలిసి సోమవారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పోలీసులు ఆపుతున్నా కూడా ఆగకుండా ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతున్న ముత్యాలును పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించారు. అతడు తన పేరు, నేర చరిత్ర బయటపెట్టాడు. ఇప్పటికే 10 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించాడు. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు వెల్లడించాడు. చోరీ చేసిన వాహనాలను అతడి నుంచి పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. అంతర్రాష్ట్ర వాహనాల దొంగను పటుకున్న ఎస్సై అఖిలను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ నాగరాజు, ఎస్సైలు యయాతి రాజు, అఖిల, క్రైమ్ విభాగం హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రరావు, కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



మాట్లాడుతున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

గుండాల, మే 5: మావోయిస్టు పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల ఎస్ఐ సైదా రవూఫ్ సిబ్బందితో పెట్రోలింగ్‌కు వెళ్తుండగా మండలంలోని తూరుబాక గ్రామం నందు రోడ్డుపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించారు. వారిని పట్టుకొని విచారించగా ఆళ్లపల్లి మండలం నడిమి గూడేనికి చెందిన పాయం రాజేందర్ , గుండాల మండలం ఘణపురం గ్రామానికి చెందిన కల్తి పాపాయ్య ఈ ఇద్దరు గతంలో ప్రజాప్రతిఘటన దళంలో పనిచేశారు. రాజేందర్ గతంలో దళంలో పనిచేసి పోలీసులు లొంగిపోయాడు. కల్తి పాపయ్య హత్యా ప్రయత్నం కేసులో జైలుకెళ్లి వచ్చాడు. వీరిద్దరూ జల్సాలకు అలవాటు పడి మావోయిస్టు పార్టీ పేరు చెప్పి గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో రెండు మూడు నెలల నుంచి వ్యాపారస్తులకు ఫోన్లు చేసి పార్టీ ఫండ్ కోసం డబ్బులు కావాలని బెదిరిస్తున్నారు. వీరిద్దరిని అరెస్ట్ చేసి రూ.5000 నగదు, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన గుండాల సీఐ లోడిగ రవీందర్, ఎస్ఐ సైదా రావూఫ్, పీసీ వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు.

## సంక్షిప్తం

### అక్రమ గృహ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

భద్రాచలం, మే 5: ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాజుపేట కాలనీశాఖ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ సొసైటీ ద్వారా కొనుగోలు చేసిన స్థలంలో గిరిజనేతరుడు సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా, 1/70కి విరుద్ధంగా గృహ నిర్మాణాన్ని చేపట్టడాన్ని నిలుపుదల చేయాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావుకు సోమవారం సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు.

### అందాల పోటీలు రద్దుచేయాలి

భద్రాచలం, మే 5: మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా 7న హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అందాల పోటీలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాదెళ్ల లీలావతి, డి.కనకశ్రీ, కె.రమణ, సీహెచ్.హైమావతి, టి.లక్ష్మి, గంగ పాల్గొన్నారు.

### ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

మణుగూరు టౌన్, మే 5: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ ఐడీ విధానంలో భాగంగా సోమవారం నుంచి ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు వ్యవసాయ విస్తరణ అధికారి కొమరం లక్ష్మణరావు తెలిపారు. సోమవారం గుట్టమల్లారం రైతు వేదికలో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏవో రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. తెలంగాణలో రైతులు తప్పనిసరిగా తమ భూములను ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

### పాండురాజుకు గోల్డ్ మెడల్

మణుగూరు టౌన్, మే 5: ఈ నెల 3,4 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలకు స్కైజిమ్ ట్రైనర్ నాగరాజు వద్ద పార్శిక పాండురాజు శిక్షణ పొందారు. ఈ పోటీల్లో పాండురాజు 53 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. గతంలో రాష్ట్రస్థాయి ఓపెన్ బెంచ్‌ప్రెస్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఇలా వరుసగా మణుగూరుకు గోల్డ్‌మెడల్స్ తీసుకొస్తుండడంతో పలువురు పాండురాజును అభినందించారు.

### జస్టిస్ ప్రియదర్శినికి నివాళి

దమ్మపేట రూరల్, మే 5: అనారోగ్యంతో మృతి చెందిన హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రియదర్శినికి దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి భవాని, బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మారం సతీష్ కుమార్, న్యాయవాదులు గొంది మురళీమోహన్, సంధ్యారాణి, సంజయ్, నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎండీకి సమ్మె నోటీస్

కొత్తగూడెం సింగరేణి, మే 5: బొగ్గు పరిశ్రమ రక్షణ, నూతన బొగ్గు గనుల ప్రారంభం, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం తదితర 17 డిమాండ్ల సాధనకు ఈ నెల 20న సమ్మెకు సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంకు నాయకులు సోమవారం సమ్మె నోటీస్ ఇచ్చారు. హెచ్ఎంఎస్ నుంచి రియాజ్ అహ్మద్, జీఎల్‌బీకేఎస్ నుంచి సీతారామయ్య, గట్టయ్య, రాములు, మణిరాంసింగ్, మహేందర్ పాల్గొన్నారు.

### పిడుగుపాటుకు పశువులు మృతి

దుమ్ముగూడెం, మే 5: మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపడి మూడు పశువులు మృతిచెందాయి. మండల పరిధిలోని మారాయిగూడెం పంచాయతీ జిన్నెగట్టులో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడడంతో ఆ సమయంలో పిడుగు పడింది. అపకా రామారావుకు చెందిన మూడు పశువులపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృత్యువాతకు గురయ్యాయి. మృతిచెందిన పశువుల యజమానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### బస్ సర్వీస్ ప్రారంభం

ఇల్లెందు, మే 5: ఇల్లెందు నుంచి సత్తుపల్లికి, మణుగూరుకు ఆర్టీసీ సర్వీసును ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ఇల్లెందు బస్టాండ్‌లో ప్రారంభించారు. డిపో ఇన్‌చార్జ్ సునీత, డీఎం దేవేందర్ గౌడ్ పాల్గొన్నారు.

### గ్యారెంటీల అమలుకు ర్యాలీ, ధర్నా

ములకలపల్లి, మే 5: ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్న డిమాండుతో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ములకలపల్లిలో ర్యాలీ, తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగాయి. డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మికి, ఎంపీడీవో రేవతికి, ఏవో అరుణ్‌కుమార్‌కు నాయకులు వినతిపత్రాలు ఇచ్చారు.

### ఎస్ఈకి సన్మానం

పాల్వంచ, మే 5: కేటీపీఎస్ ఏడో దశ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) ఎం.శ్రీనివాసరావు.. వైటీపీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆయనకు బీఆర్‌వీకేఎస్ ఏడోదశ రీజినల్ కమిటీ సోమవారం సన్మానించింది.

### చెక్కుల పంపిణీ

జూలూరుపాడు, మే 5: మండలంలోని కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ సోమవారం పంపిణీ చేశారు.

### నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే

దమ్మపేట, మే 5: బీఆర్ఎస్ నాయకురాలు కాకా నాగమణి తండ్రి వెంకటేష్ ఆదివారం రాత్రి మృతిచెందారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సోమవారం సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

### సింగరేణి క్వార్టర్లు కూల్చివేత

ఇల్లెందు, మే 5: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ విస్తరణ నిర్వాసితులకు గతంలో కేటాయించిన క్వార్టర్లను యాజమాన్యం తిరిగి స్వాధీనపర్చుకుంది. అక్కడ 100 పడకల ఆస్పత్రికి నిర్మించాలని నిర్ణయించింది. మొత్తం 30 క్వార్టర్లకుగాను గతంలోనే 28 కూల్చింది. మిగిలిన రెండింటిని సోమవారం కూల్చివేసింది. దీనికి నిర్వాసితులు అభ్యంతరం తెలిపారు.

### వచ్చే నెల 9 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

కొత్తగూడెం టౌన్, మే 5: అన్ని రకాల చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి వచ్చే నెల 9 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముందస్తుగా ఈ నెల 5 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలోని అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ ఉంటుందని పేర్కొన్నారు.

### కవల పిల్లల జననం

పాల్వంచ, మే 5: మండలంలోని రేపల్లెవాడకు చెందిన గర్భిణి జూపల్లి పల్లవి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఎదురు కాళ్లతో ఉన్న ఆ కవల మగ పిల్లలకు వైద్య సిబ్బంది సాధారణ ప్రసవం చేశారు. ఇంటర్నేషనల్ మిడ్ వైఫరీ (మంత్రసాని) దినోత్సవాన ఇంత క్లిష్టమైన డెలివరీ చేయడం ఆనందాన్నిచ్చిందని కాన్పు చేసిన మెయిడ్ వైఫ్ వేమూరు సుజాత చెప్పారు.

### విఠల్‌రావు నగర్‌లో వైద్య శిబిరం

మణుగూరు టౌన్, మే 5: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని విఠల్‌రావునగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సింగరేణి వైద్య విభాగం, సింగరేణి సేవా సమితి సంయుక్త నిర్వహణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 145 మందిని సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616